


మూడోవంతు భూమి ట్రిపుల్ ఆర్‌కు

- ఒకే గ్రామంలో 150 ఎకరాలు సేకరణ
- పెద్దల భూములను కాపాడేందుకు అలైన్‌మెంట్ మార్పు
- రోడ్డు కోసం రెండు పంటలు పండే పొలాలు
- పరిహారం ప్రకటించకుండానే సర్వే
- న్యాయం చేయాలని రైతుల వేడుకోలు

6

సంగారెడ్డిలో నేడు ఇఫ్తార్ విందు

- ఏర్పాట్లు పరిశీలించిన నిర్మలా జగ్గారెడ్డి
- సంగారెడ్డిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి, మార్చి 28: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నేడు సంగారెడ్డి పట్టణంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని ఆమె సూచించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు నిర్మల హాజరయ్యారు. అధికారులు, ముస్లింలు ఆమెకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.



ప్రభుత్వ ఇఫ్తార్ విందుకు హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి



సంగారెడ్డిలోని మిలాద్ గ్రౌండ్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

నీవు సౌమ్యుడివి.. ప్రభాకరన్న

- నిన్ను కాదంటానే.. నేరుగా వచ్చి పనులు చేయించుకో..
- దుబ్బాక ఎమ్మెల్యేతో సీఎం రేవంత్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): "నీవు వివాదాలకు పోవు.. ఎవరితెరువు రావు.. నీవు సౌమ్యుడివి... నీకేమి అడ్డేమీ ఉంటదే.. నేరుగా వచ్చి పనులు చేయించుకో.. నిన్నుకాదంటానే ప్రభాకరన్నా.." అంటూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డిని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి అన్నమాటలివి. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ప్రభాకర్‌రెడ్డి కలిసి పలు సమస్యలపై విన్నవించారు. దుబ్బాక వెనుకబడి ఉందని, మల్లన్న సాగర్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ ఇప్పటివరకు కాలువలు పూర్తికాలేదని, కాలువల నిర్మాణానికి రూ.200 కోట్ల నిధులు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం తాను వీలు చేసుకుని సిద్దిపేటకు వచ్చి, మల్లన్నసాగర్ కాలువల నిర్మాణం పనులపై సమీక్ష జరుపుతానని హామీనిచ్చారు. దుబ్బాక నియోజకవర్గంలోని రహదారుల సమస్యలను వివరించారు. రుణమాఫీ హామీలు పూర్తికాగానే నిర్మాణాత్మకమైన అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని చెప్పారు.



(ఫైల్)

పార్టీలతీతంగా నిధులు కేటాయించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. రాష్ట్రంలో 20 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్న యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్శిటీని దుబ్బాకలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న హబ్షీపూర్ నుంచి దుబ్బాక, లచ్చపేట రహదారి విస్తరణకు రూ.35కోట్లను హెచ్ఎం ద్వారా సెంట్రల్ లైటింగ్‌తో కూడిన రహదారిని ఏర్పాటు చేయడానికి నిధులను మంజూరు చేస్తానని హామీ నిచ్చారు. యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటుకు స్థలసేకరణకు చర్యలు తీసుకోవాలని సీఎంవో అధికారులకు ఆదేశాలను ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎంకు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సుర్రుమంటున్న సూరీడు

- మళ్లీ పెరుగుతున్న ఎండ
- దిగ్వాల్‌లో 40.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

కోహీర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం వర్షాలు కురియడంతో చల్లబడిన వాతావరణం మళ్లీ వేడెక్కుతున్నది. రెండ్రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో శుక్రవారం పలు మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. ఏప్రిల్ 3 నుంచి మరో తుఫాను రానున్నదని, అప్పటివరకు ఎండల ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొన్నది.



ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు

సంగారెడ్డి జిల్లా దిగ్వాల్ 40.4, నిజాంపేట్ 40.3, గుండ్లమాచనూరు 40.2, పుల్కల్ 40.1, పల్వట్ల 40.0, మల్‌చెల్మ 39.9, కల్హేర్ 39.9, వట్‌పల్లి 39.9, సిర్గాపూర్ 39.8, జిన్నారం 39.7, చౌటకూర్ 39.6 సుల్తాన్‌పూర్ 39.6, కడ్పల్ 39.6, కంది 39.5, హత్నూర ఆర్సీపూర్ 39.4, మనూర్ 39.3, రామచంద్రాపురం 39.2, అల్గోల్ 39.2, నారాయణఖేడ్ 39.2, కొండాపూర్ 39.2 హత్నూర 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో చేగుంట 40, నర్లాపూర్ 39.9, వడ్డి 39.9, కౌడిపల్లి 39.8, కొల్చారం 39.7, రాజ్‌పల్లి 39.7, నర్సాపూర్ 39.7, చిట్కుల్ 39.7, శంకరంపేట్ (ఆర్) 39.6, పాతూర్ 39.6, మెదక్ 39.5, అల్లాదుర్గం 39.5 రేగోడు 39.4, దామరంచ 39.2, లింగాయపల్లి 39.1, చిప్పల్‌తుర్తి 39.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సిద్దిపేట జిల్లాలో కోహెడ 40.2, సిద్దిపేట 40.1, రాఘవాపూర్ 40, శనిగరం 40, బెజ్జంకి 39.9, రాంపూర్ 39.9, బేగంపేట్ 39.9, పోతరెడ్డిపల్లి 39.8, పెద్దకోడూరు 39.8, తుక్కాపూర్ 39.8, కట్కూర్ 39.7, చిట్యాల 39.7, అంగడికిష్టాపూర్ 39.6, రేబర్తి 39.6, దౌల్తాబాద్ 39.6, తిప్పారం 39.6, నారాయణరావుపేట 39.5, నంగునూరు 39.4 సముద్రాల 39.3 మున్నిగంప 39.3, వెంకటరావుపేట 39.3, దూళ్మిట్ట 39.2, గౌరారం 39.2, హబ్సీపూర్ 39.2, ముస్త్యాల 39.2, చీకోడ్ 39.1, మిరుదొడ్డి 39.1, కొడకండ్ల 39 బెజుగావ్ 39 డిగ్రీలుగా నమోదయ్యాయి.

'కాంతార్' మోసం పెద్దదే!

- 'ఆంధ్రజ్యోతి'తో మొరపెట్టుకున్న బాధితులు

కౌడిపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 28: 'కాంతార్' సంస్థ మోసాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో బాధితులు ఒకొక్కరుగా తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్నారు. రెండువేల మంది వద్ద రూ. 5 కోట్లు వసులు చేసినట్లు అంచనా వేయగా.. ఇప్పటి వరకు ఒక్కరే పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తున్నదని. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన 'కాంతార్ కనికట్టు' కథనాన్ని చూసి పదుల సంఖ్యలో బాధితులు బయటకు వచ్చారు. దేవులపల్లి, కౌడిపల్లి, మహ్మద్‌నగర్, కన్నారం, వెంకటపూర్ (ఆర్), రాజిపేట్, ముట్రాజ్‌పల్లి గ్రామాలకు చెందిన బాధితులు ఆంధ్రజ్యోతి ప్రతినిధికి ఫోన్ చేసి తాము మోసపోయిన వైనాన్ని వివరించారు. ఏజెంట్లను నమ్మి తమ ఒంటిపై నగలు అమ్మి డబ్బులు ఇచ్చామని వాపోయారు.

6

21 రోజులు.. రూ.1.11 కోట్లు

- మల్లన్న ఆలయంలో హుండీలెక్కింపు
- 112 గ్రాముల బంగారం, 9.200 కిలోల వెండి, 24 విదేశీ కరెన్సీ నోట్లు

8

పైలట్ ప్రాజెక్టు పట్టాలెక్కేదెన్నడో?

- కొన్ని చోట్ల పూర్తయిన మినీ ఐవోసీలు
- మరికొన్ని చోట్ల అర్ధాంతరంగా.. ఇంకొన్నిచోట్ల శంకుస్థాపనలకే పరిమితం

ప్రాణాలతో ఆట

- పల్లెల్లోనూ బెట్టింగ్ జోరు
- ఐపీఎల్ వేళ.. గుట్టుచప్పుడు కాకుండా నిర్వహణ
- రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనం
- బుకీల ద్వారా అంతా మొబైల్‌లోనే..
- యువతలో వ్యసనంలా మారుతున్న బెట్టింగ్

క్రికెట్ అంటే చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఆసక్తిగా చూస్తుంటారు. ఇక అందులోనూ ఐపీఎల్ అంటే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. టాస్ నుంచి మొదలుకుని మ్యాచ్ పూర్తయ్యే వరకు క్రీడాభిమానులు టీవీలకు, ఫోన్లకు అతుక్కుపోతుంటారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ఆన్‌లైన్ బెట్టింగ్‌ను పూర్తిగా నిషేధించినా ఉమ్మడి మెదక్ జిల్లాలో బెట్టింగ్ దందా చాపకింద నీరులా జోరుగా సాగుతుంది. రోజుకు రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో బుకీలు ఈ బెట్టింగ్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గతంలో పట్టణాలకే పరిమితమైన క్రికెట్ బెట్టింగ్ ఇప్పుడు పల్లెలకు కూడా పాకుతోంది. బుకీలు పల్లెల్లో తమ ఏజెంట్ల ద్వారా పందాలు నిర్వహిస్తున్నారంటే ఈ దందా ఏ స్థాయిలో కొనసాగుతుంతో అర్థం చేసుకోవచ్చు.

- సిద్దిపేట టౌన్ / మెదక్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి)



దేశ, రాష్ట్రవ్యాప్తంగా బెట్టింగ్ యాప్‌లపై, ప్రమోటర్లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నా ఉమ్మడి మెదక్ జిల్లాలో అవేవి పట్టనట్లు కొందరు గుట్టుచప్పుడు కాకుండా దందా నిర్వహిస్తున్నారు. పలు యాప్‌లలో బెట్టింగ్ కొనసాగేది.. ఈ ఏడాది బెట్టింగ్ యాప్ నిర్వాహకులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతుండడంతో తెరపైకి బుకీలు వచ్చి బెట్టింగ్‌ను కొనసాగిస్తున్నారు. పట్టణాలు, పల్లెల్లో బెట్టింగ్‌కు ఆసక్తి చూపే వారితో నిర్వాహకులు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారు. మరి కొందరు వెబ్‌సైట్ రూపొందించి ఏజెంట్లను నియమించుకుని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇంకొందరు ప్రత్యేకంగా పాస్‌వర్డ్‌లు ఐడీలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇలా ఒక్కొక్కరు ఒక్కో తీరుతో ఈదందాను సాగిస్తున్నారు. ఇక ఉమ్మడి జిల్లాలో రోజుకు రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయి. యువత, మధ్యతరగతి వారు, చిరువ్యాపారులు అధిక వడ్డీలకు తీసుకొచ్చి ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలో వారి బంధువులను, స్నేహితులను కూడా ఈ ఊబిలోకి లాగుతున్నారు. ఈ దందాలో కొందరు మాత్రమే ఎంతో కొంత సంపాదిస్తున్నా.. డబ్బు పోగొట్టుకుని అప్పుల బారిన పడుతున్న వారి సంఖ్య అధికంగానే ఉంటుంది.

మిగతా 7వ పేజీలో

ఆర్థికంగా నష్టం, చివరకు ప్రాణాలూ బలి

చిన్నశంకరంపేట మండలం భాగిర్దపల్లికి చెందిన రైల్వేఉద్యోగి సత్యనారాయణ వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని తన కొడుకు ముఖేష్(28)కు తన ఉద్యోగం ఇప్పించాడు. ఈ క్రమంలో చేగుంట రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూనే ముఖేష్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. ఈ బెట్టింగ్‌ల ద్వారా దాదాపు రూ.2కోట్లు పోగొట్టుకున్నాడు. అప్పులు కూడా చేశాడు. వాటిని తీర్చేందుకు మేడ్చల్‌లో ఉన్న ఇళ్లు, రెండు స్థలాలను కూడా అమ్మేశారు. అయినా అప్పులు తీరలేదు. ఇంత జరిగినా ముఖేష్‌లో మార్పు రాలేదు. వారికున్న మరో ఇంటిని అమ్మడానికి సిద్ధపడ్డాడు. దాంతో తండ్రీకొడుకులకు మధ్య వాగ్వాదం జరిగేది. ఈ క్రమంలో తండ్రి ఓపిక పట్టలేక ఓ రోజు ముఖేష్ నిద్రపోతున్న సమయంలో ఇనుపరాడ్‌తో తలపై మోదడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన దాదాపు ఏడాది క్రితం చోటుచేసుకుంది.

ప్రయోజకుడు అవుతాడనుకుంటే ప్రాణాలు కోల్పోయాడు

రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన దొమ్మాట భానుప్రకాశ్ (30) డిగ్రీ హోల్డర్. గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడ్డాడు. మొదట చిన్న చిన్నగా ప్రారంభమైన బెట్టింగ్ చివరికి వ్యసనంలా మారింది. దాదాపు రూ.15 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. మనస్తాపానికి గురై గత సంవత్సరం డిసెంబరు 17న గుర్రై పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రయోజకుడు అవుతాడనుకున్న తమ కుమారుడు వ్యసనాల బారిన పడి బలవన్మరణానికి పాల్పడడంతో తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచాడు.



సన్నబియ్యానికి సన్నద్ధం

- జిల్లాకు చేరిన ఉగాది కానుక
- ఏప్రిల్ 1 నుంచి పంపిణీ
- డీలర్ల వద్ద ఉన్న దొడ్డు బియ్యం వెనక్కి
- ఇక రేషన్‌దందాకు చెక్

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరొక పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు పేదలకు తీపి కబురు అందించడంతో పాటు అందుకు చకచకా ఏర్పాట్లు కూడా ముమ్మరం చేసింది. రేషన్ కార్డుదారులకు ఉగాది కానుకగా సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. అయితే ముందుగా ఈనెల 30న ఉగాది రోజున సూర్యాపేట జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 1నుంచి అన్నిరేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని పేదలకు పంపిణీ చేస్తారు. ప్రస్తుతం రేషన్ డీలర్ల వద్ద నిల్వ ఉన్న దొడ్డు బియ్యం మొత్తం వెనక్కి పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిర్ణయంతో సన్నబియ్యం కొనుగోలు చేయలేని పేదలకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ పంపిణీపై జిల్లా ఉన్నతాధికారులు, సివిల్ సప్లయ్ అధికారులు డీలర్లతో సమీక్షలు నిర్వహించారు. బియ్యం పంపిణీ విషయంలో రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

జిల్లాలో వివరాలు ఇలా

మొత్తం రేషన్ కార్డులు	2,92,131
అన్నపూర్ణ కార్డులు	82
అంత్యోదయ కార్డులు	18,341
కార్డుల్లోని సభ్యుల సంఖ్య	8,95,467
జిల్లాలో రేషన్ షాప్‌ల సంఖ్య	686
అవసరమైన బియ్యం కోటా	5,720 మెట్రిక్ టన్నులు

రేషన్‌కార్డుదారులు

రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం వ్యక్తికి ఆరుకిలోల చొప్పున బియ్యం అందజేస్తుంది. దొడ్డు బియ్యం కావడంతో అనేకమంది తినడానికి ఆసక్తి చూపడం లేదు. దొడ్డు బియ్యం తినని వారు డీలర్లకే కిలో రూ.13నుంచి రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని డీలర్లు వ్యాపారులకు రూ.20 నుంచి రూ.22 చొప్పున రేషన్ దందా చేసే వారికి విక్రయిస్తున్నారు. జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట అనుమతి లేని రేషన్ బియ్యం పట్టుబడుతూ కేసులు నమోదు చేస్తున్నా, ఈ దందా మాత్రం ఆగడం లేదు. అయితే సన్నబియ్యం సరఫరా చేస్తే చాలా మంది తింటారని, రేషన్ దందాకు కూడా చెక్ పెట్టొచ్చు అని భావిస్తున్నారు.



లబ్ధిదారులకు సన్నం బియ్యం పంపిణీ

పేదలకు సన్నబియ్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాప్‌లకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నాము. జిల్లాలో 686 రేషన్ షాపులు ఉండగా.. ఇప్పటివరకు 319 రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా చేశాం. మరో రెండు రోజుల్లో అన్ని రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరా పూర్తవుతుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తాం.

- తనూజ, డీఎస్‌వో

ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సన్నద్ధం కావాలని అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయంలో వరిధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆయాశాఖల అధికారులతో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 419 కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు సమకూర్చుకుని ఏప్రిల్ మొదటివారం నుంచి కేంద్రాలను ప్రారంభించాలని ఆయన తెలిపారు. ఈ యాసంగిలో 419 అన్ని కేంద్రాల్లో సన్నరకం కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దొడ్డురకం కాకుండా సన్నరకం ధాన్యాలను కేంద్రంలో అమ్ముకోవాలని దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. ట్యాబ్ ఎంట్రీ చేసిన రెండు, మూడు రోజుల్లోపు రైతుల అకౌంట్‌లో డబ్బు జమవుతాయని తెలిపారు. కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి తనుజ, డీఎం సివిల్ సప్లయ్ ప్రవీణ్, ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, చంద్రకళ, ఏసీపీలు మధు, పురుషోత్తం, సతీష్, ఎల్‌డీఎం హరిబాబు, డీఎంనాగరాజు, ఇతర శాఖల అధికారులు, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (శనివారం సాయంత్రం)
సహర్: 4:50 (ఆదివారం ఉదయం)

న్యాయం చేయండి సారూ!

- రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా చేశారు
- అంతకు ముందే అతని పేరిట రుణం


దరఖాస్తును చూపిస్తున్న ఎండీ బహదూర్

చేర్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తనకు 2023-2024 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన మైనారిటీ కార్పొరేషన్ లోన్‌ను పలువురు బీఆర్ఎస్ నాయకులు తన పేరిట మరో వ్యక్తికి ఇచ్చారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళితే.. కొమురవెల్లి మండలం రసూలాబాద్‌కి చెందిన ఎండి.బహదూర్ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బీఆర్ఎస్ హయాంలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి మైనారిటీ కార్పొరేషన్ ద్వారా బహదూర్ చికెన్, మటన్ విక్రయ దుకాణం పెట్టడానికి దరఖాస్తు చేశాడు. రుణం మంజూరైంది. కానీ ఈవిషయం అతడికి తెలియకపోవడంతో కూలీ పనులకు వెళుతూనే ఉన్నాడు. మళ్లీ దుకాణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇంటర్‌నెట్ సెంటర్‌కు వెళ్లగా అప్పటికే మైనారిటీ కార్పొరేషన్ రుణం పొందినట్లుగా ఆన్‌లైన్‌లో ఉన్న వివరాలు చూసి కంగుతిన్నాడు. రుణం మంజూరైన విషయం తనకు తెలియదని అధికారులను ఆశ్రయించాడు. తీరా పరిశీలించే సరికి అతడి పేరుతో మరో వ్యక్తి ఆ రుణం పొందినట్లు గుర్తించారు. నాయకులు తనకు అన్యాయం చేశారంటూ బహదూర్ సోషల్‌మీడియాలో పోస్టింగ్ పెట్టాడు. తనకు న్యాయం చేయాలని, ప్రభుత్వం స్పందించి రాజీవ్ యువ వికాసం ద్వారా ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

21 రోజులు.. రూ.1.11 కోట్లు


కరెన్సీ లెక్కిస్తున్న శివరామకృష్ణ భజన మండలి మహిళా సభ్యులు

- మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపు
- 112గ్రాముల బంగారం, 9.200 కిలోల వెండి, 20 క్వింటాళ్ల ఒడిబియ్యం, 24 విదేశీ కరెన్సీ నోట్లు

చేర్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో శుక్రవారం కానుకలు, ఒడి బియ్యం హుండీ లెక్కింపులను చేపట్టారు. ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆలయ ముఖమండపంలో శివరామకృష్ణ భజనమండలి మహిళా సభ్యులు కరెన్సీ లెక్కించారు. రూ1,11,96,965 నగదు, 112 గ్రాముల బంగారం, 9.200 కిలోల వెండి, 20 క్వింటాళ్ల ఒడిబియ్యం, 24 విదేశీ కరెన్సీ నోట్లు లభ్యమయ్యాయి. ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఇటీవల ముగిసిన నేపథ్యంలో చివరి వారాలలో భారీగా భక్తులు తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. మరో రెండు రోజులలో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో పాటు ఆయా హుండీలు నిండుతుండటంతో ఆలయాధికారులు లెక్కింపును చేపట్టారు. ఈ రాబడి కేవలం 21 రోజుల్లోనే సమకూరింది. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో నిర్వహించిన లెక్కింపులలో, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి, అల్లం శ్రీనివాస్, మామిడా లక్ష్మి, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, స్థానాచార్యుడు మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


బంగారం, వెండి మొక్కుబడులు


విదేశీ కరెన్సీ

మూడోవంతు భూమి ట్రిపుల్ ఆర్‌కు

- కొందరి భూములను కాపాడేందుకు అలైన్‌మెంట్ మార్పు
- ఒకే గ్రామంలో 150 ఎకరాల భూమి
- పరిహారం ప్రకటించకుండానే సర్వే
- భయభ్రాంతులకు గురిచేసే బలవంతపు అరెస్టులు

కొండాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆ ఊరిలో 40 శాతం భూమి రోడ్డు కోసం తీసేసుకుంటున్నారు. భూమిపైనా ఆధారపడిన 60 రైతు కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయి. పక్కనే ప్రభుత్వ భూములున్నా.. రెండు పంటలు పండే పొలాలను తీసుకోవడంతో రోడ్డున పడుతున్నామని రైతులు వాపోతున్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్ రైతులకు గ్రామ రెవెన్యూ పరిధిలో 380 ఎకరాలు, పక్కనే ఉన్న సదాశివపేట మండలం పెద్దాపూర్ రెవెన్యూ పరిధిలో 50 ఎకరాల సాగు భూములు ఉన్నాయి. ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణం కోసం 60 మంది రైతులకు చెందిన 150 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారం ప్రభుత్వ, అసైన్డ్ భూమిని సేకరించాల్సి వచ్చేది. కానీ ఈ అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు నిర్మిస్తే రాజకీయ నాయకులు, ప్రైవేటు కంపెనీలు, రియల్ వ్యాపారుల భూములు కొన్ని సేకరించాల్సి వచ్చేది. దీంతో చక్రం తిప్పిన బడాబాబులు అలైన్‌మెంట్‌ను మార్చేలా ఒత్తిడి తీసుకువచ్చారు. కొత్త ప్లాన్ ప్రకారం పదుల సంఖ్యలో చిన్న రైతులు భూములు కోల్పోతున్నారు. ప్రస్తుత అలైన్‌మెంట్‌కు 100 మీటర్లు కిందికి జరిగితే 200 ఎకరాలు.. 150 మీటర్లు పైకి జరిగితే 300 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఒక్క రైతు భూమి కూడా సేకరించాల్సిన అవసరం ఉండదని గ్రామస్థులు పేర్కొంటున్నారు.


ట్రిపుల్ ఆర్‌లో కోల్పోయే గిర్మాపూర్ రైతుల పొలాలు


పరిహారం చెల్లించే వరకు ట్రిపుల్‌ఆర్ సర్వే చేయొద్దని రెవెన్యూ, భూసర్వే అధికారులతో మాట్లాడుతున్న రైతులు(ఫైల్)

అర్ధరాత్రి అరెస్టులు

తాజాగా ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగమైన గిర్మాపూర్-యాదాద్రి నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.5,555 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది. దీని కోసం గిర్మాపూర్‌లో చేపట్టిన భూసేకరణ ఆది నుంచి వివాదాస్పదంగానే సాగుతున్నదని రైతులు విమర్శిస్తున్నారు. పరిహారం ఎంతో ప్రకటించకుండా పోలీసుల సాయంతో భూసర్వే చేయించారని, నిరసన తెలిపిన రైతులను అరెస్టు చేయించారని ఆరోపించారు. ఇటీవల అసెంబ్లీ ముట్టడికి వాట్సాప్‌గ్రూపులో పిలుపు ఇచ్చారని ఆరోపిస్తూ అర్ధరాత్రి ఇళ్లలోకి చొరబడి రైతులను అరెస్టు చేశారని మండిపడ్డారు.

జీవనాధారం కోల్పోతాం



ట్రిపుల్ ఆర్‌తో వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న మా కుటుంబాలు నిరాశ్రయులుగా మిగిలిపోతాం. ఎన్ని కష్టాలు వచ్చినా భూమిని అమ్మకుండా కాపాడుకుంటూ వచ్చాం. ఏడాదికి రెండు పంటలు పండిస్తున్నాం. పచ్చగా ఉన్న మాపై పలుకుబడిని ఉపయోగించి వారి భూములు కాపాడుట కోసం అలైన్‌మెంట్‌ను మార్చారు.

-పట్టోళ్ల ఆంజనేయులు, రైతు, గిర్మాపూర్

భూమికి బదులు భూమి ఇవ్వాలి



రెండు ఎకరాల భూమిలో పంటలను సాగు చేస్తున్నాను. వ్యవసాయం తప్పా వేరే పని తెలియదు. రోడ్డుకోసం భూమి కావాల్సివస్తే భూమికి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఇచ్చి పరిహారం చెల్లించాలి లేదా బహిరంగ మార్కెట్ ధర కట్టించాలి. బయట వ్యవసాయ భూమిని కొనుగోలు చేసే విధంగా దారి చూపాలి.

-గొల్ల మల్లేశం, రైతు, గిర్మాపూర్

రాంగ్‌రూట్‌లో వెళ్లి రెండు బైకులను ఢీకొన్న డీసీఎం

ఇద్దరి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

కోహీర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం డ్రైవర్ రాంగ్‌రూట్‌లో వెళ్లి రెండు బైకులను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కొత్తూరు(డి) గ్రామ సమీపంలోని 65వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, కోహీర్ పోలీసుల కథనం ప్రకారం.. మద్యం మత్తులో ఉన్న డీసీఎం డ్రైవర్ వెంకటాపూర్ చౌరస్తా నుంచి రాంగ్‌రూట్ కొత్తూరు(డి) వైపు వెళ్తా ఉండగా అటు నుంచి జహీరాబాద్ వైపు టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వస్తున్న జహీరాబాద్‌కు చెందిన ఉమేష్(58), అతని భార్య ఈశ్వరమ్మ, కొడుకు సిద్ధును డీసీఎం వాహనం ఢీ కొట్టింది. దీంతో ఉమేష్ అక్కడికక్కడే మృతిచెందగా ఈశ్వరమ్మ అతను కొడుకు సిద్ధుకు తీవ్రంగా గాయాలయ్యాయి. మరో బైక్‌పై వస్తున్న సంగారెడ్డి జిల్లా కంది మండలం మక్త అల్లూరు గ్రామానికి చెందిన శ్రీశైలం(47)ను కూడా డీసీఎం ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే తీవ్రంగా గాయపడిన ఈశ్వరమ్మ, సిద్ధును సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కోహీర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.


శ్రీశైలం మృతదేహం


ఉమేష్ మృతదేహం


ప్రమాదంలో గాయపడిన ఈశ్వరమ్మ, సిద్దు

రైతు డిక్లరేషన్‌ను తుంగలో తొక్కిన కాంగ్రెస్

- రుణమాఫీకి తూట్లు పొడిచి సీఎం రేవంత్‌రెడ్డి
- హామీలను నిలబెట్టుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు
- ఉమ్మడి జిల్లా రైతు సత్యాగ్రహ దీక్షలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మెదక్ అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రైతు డిక్లరేషన్, మ్యానిఫెస్టో సాక్షిగా కాంగ్రెస్ పార్టీ అన్నదాలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని, మాట తప్పిందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆరోపించారు. రుణమాఫీకి తూట్లు పొడిచిన రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. రైతు హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ వద్ద బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశంగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి జిల్లా రైతు సత్యాగ్రహ దీక్షకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రచారంలో ఊదరగొట్టిన రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీలో ఎడాపెడా కోతలు పెట్టి, లక్షల మందికి ఎగనామం పెట్టారన్నారు. మొత్తం 42 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ప్రకటించి, చివరికి 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందన్నారు. ఇంకా 16.65 లక్షల మంది రైతులకు రూ.10 వేల కోట్లకు పైగా రుణమాఫీ చేయకుండా ఎగొట్టారని తెలిపారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.12 వేలకు కుదించడం దారుణమన్నారు. రైతు భరోసా నిధులను అన్నదాతల ఖాతాలో జమ చేయాలన్నారు. వడ్లు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న రూ.12 వేలు ఏమయ్యాయని అంజిరెడ్డి ప్రశ్నించారు .రాష్ట్రంలో కాంగ్రెస్ దౌర్భాగ్య పాలనలో 367 మంది రైతు ఆత్మహత్యలకు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోదీ పీఎం కిసాన్ యోజన, పంటల బీమా, ఎరువుల సబ్సిడీ, కిసాన్ సమ్మాన్, కౌశల్ వికాస్ యోజన, ఆత్మనిర్భర్ వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కిసాన్ మోర్చా అధ్యక్షులు సత్యనారాయణ, రాజేందర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మల్లుపల్లిలో కుల బహిష్కరణ

మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

మిరుదొడ్డి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో తనను, తన కుంటుంబ సభ్యులను కులపెద్దలు బహిష్కరణకు గురిచేశారని గొంగళ్ల కుమార్ తెలిపారు. బాధితుడి కథనం ప్రకారం.. కొన్నిరోజుల నుంచి మల్లుపల్లి గ్రామానికి చెందిన గొంగళ్ల కుమార్, మరో వ్యక్తి మధ్య ఆరు గుంటల భూమి విషయంలో గెట్టు పంచాయితీ నెలకొన్నది. ఈ విషయం గ్రామంలో కుల పెద్దల వద్ద పంచాయితీ నిర్వహించారు. ఇందులో పెద్దలు గొంగళ్ల కుమార్, కుటుంబసభ్యులను కుల బహిష్కరణ చేశారు. ఎవరూ మాట్లాడకూడదని, కులంలో జరిగే కార్యక్రమాలకు పిలవకూడదని తీర్మానించారు. ఈ విషయాన్ని మిరుదొడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై మిరుదొడ్డి ఎస్ఐ పర్శరాములును వివరణ కోరగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


ఫిర్యాదు పతిని చూపుతున్న బాధితుడు కుమార్



క్షణికావేశం.. మృత్యుపాశం

కారణమేదైనా నిండు జీవితానికి స్వస్తి

ఇటీవల పెరుగుతున్న బలవన్మరణాలు

కుటుంబాలు చిన్నాభిన్నం.. అయినవారికి శోకం

ఒత్తిడి జయిస్తేనే ఆత్మహత్య ఆలోచనలకు దూరం

మెదక్ పట్టణానికి చెందిన విజయలక్ష్మి(52), కూతురు మణిదీపిక(27) ఈనెల 17వ తేదీన మెదక్ బ్రాహ్మణవీధిలో తమ సొంత ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. తల్లీకూతురు సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. 19వ తేదీన శవాలుగా తేలారు. వీరి ఆత్మహత్యకు పాల్పడటానికి కుటుంబ కలహాలే కారణమని పోలీసులు భావిస్తున్నారు.

నిజాంపేటకు చెందిన ఉదయ్‌కుమార్(24), ఎం.రోహిత(20) ప్రేమించుకున్నారు. వీరి పెళ్లికి కుటుంబీకులు అంగీకరించలేదు. దీంతో మనస్తాపం చెందిన ప్రేమ జంట జనవరి 10వ తేదీన ఆత్మహత్యకు పాల్పడ్డారు. మునిపల్లి మండలం బుస్సారెడ్డిపల్లి శివారులోని సింగూరు ప్రాజెక్టు సమీపంలోని హరిత రెస్టారెంట్‌లో ఓ గది అద్దెకు తీసుకొని ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు.

వరంగల్‌కు చెందిన సందీప్ (30), పరకాలకు చెందిన కీర్తి (26) ఐదేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైన వారు అమీన్‌పూర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి మూడేళ్ల పాప, సంవత్సరంన్నర బాబు ఉన్నారు. వీరిద్దరి మధ్య మనస్పర్థలు పెరిగాయి. భర్త ఇంట్లో లేని సమయంలో కీర్తి జనవరి 6వ తేదీన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భార్య ఆత్మహత్యతో భర్త సందీప్ కూడా ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు.

అమీన్‌పూర్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన రజిత తన ముగ్గురు పిల్లలు సాయికృష్ణ(12), మధుప్రియ(10), గౌతమ్(8)కు శుక్రవారం రాత్రి పెరుగన్నంలో విషం కలిపి ఇచ్చి తానూ తిన్నది. పెరుగన్నం తిన్న ముగ్గురు పిల్లలు మృతిచెందగా తల్లి రజిత మాత్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నది.

ఈ నాలుగు ఘటనలలో చనిపోయిన వారివి భిన్నమైన కారణాలు కావచ్చు.. సమస్య ఏదైనా... పరిష్కారం కోసం వెతకకుండా ఆత్మహత్యలే శరణ్యంగా భావిస్తున్నారు. క్షణికావేశంలో నిండు జీవితానికి స్వస్తి పలుకుతున్నారు. తమ వారికి శోకాన్ని మిగులుస్తున్నారు. క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఇటీవల జరుగుతున్న ఈ ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి.

సంగారెడ్డి క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రేమలో విఫలమయ్యామని భగ్న ప్రేమికుల ఆత్మహత్య.. పరీక్షల్లో మంచి మార్కులు సాధించలేదని ఓ విద్యార్థి.. కుటుంబ కలహాల కారణంగా భార్యాభర్తలు, అప్పుల బాధతో మరొకరు, భార్య కాపురానికి రావడం లేదని భర్త, భర్త తిట్టాడని భార్య.. ఇలా క్షణికావేశంలో అనేక మంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. దీంతో చిన్న పిల్లలను అనాథలుగా చేయడమో, లేదా పెద్దలకు కడుపుకోత మిగిల్చడమే చేస్తున్నారు. ఒక్క క్షణం... ఆలోచిస్తే ప్రతీ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆలోచన మరిచి అనేక మంది ఆత్మహత్యల వైపు అడుగులు వేస్తున్నారు. చిన్నచిన్న కారణాలతో తమ నిండు జీవితాలను బలి తీసుకుంటున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు రోజుల్లో ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారు.

చిన్నచిన్న కారణాలతో..

చిన్న చిన్న కారణాలే ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి. భయం, అవమానం, అనుమానం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం, ఒత్తిడి తట్టుకోలేకపోవడం, అప్పుల బాధలు, దిగులు, జీవితంపై అవగాహన లేకపోవడం, జీవితంపై విరక్తి చెందడం, వివాహేతర సంబంధాలు, కుటుంబాల్లో గొడవలు తదితర సమస్యలు ఆత్మహత్యలకు కారణాలుగా మారుతున్నాయి. భార్యాభర్తలు ఉద్యోగాలు చేస్తుండటం, ఎవరికి వారు సెల్‌ఫోన్‌లలో బిజీబిజీగా ఉండటం, మనస్పర్థలు ఇలా అనేక కారణాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. సమస్య చిన్నదైనా కొందరు తీవ్రంగా ఆలోచిస్తుంటారు. మనోవేదనతో మరణం తప్ప మరోదారి లేదనే భావనతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు. సమస్యలను ఎదుర్కొని పరిష్కార మార్గం వైపు ఆలోచించకపోవడం అనేక మంది బలవన్మరణాలకు దారితీస్తున్నది. కొందరిని వ్యక్తిగత, సామాజిక రుగ్మతలు ఆత్మహత్యల వైపు అడుగులేయిస్తున్నది.

ఒక్క క్షణం ఆలోచించాలి

ప్రతీ మనిషికి జీవితం ఒక్కసారి మాత్రమే వస్తుంది. జీవితాన్ని ఆనందం, సంతోషంతో నింపుకోవాలే తప్ప అభద్రతకు తావివ్వకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు. మనసులో నుంచి చెడు ఆలోచనలు దూరం చేయాలి. ఆత్మహత్య చేసుకొనే సమయంలో మెదడులో సెరొటోనిన్ అనే రసాయనిక ద్రవ్యం పూర్తిగా తగ్గిపోతుంది. ముఖంలో తీవ్రమైన వ్యథ, బాధ కనిపిస్తుంది. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన మనసులో వస్తుంది. చిన్నచిన్న కారణాలు కూడా అతి పెద్దగా ఊహించుకుంటారు. ఆ సమయంలో ఒక్క క్షణం ఆలోచించాలి. అలాంటి వారిని కుటుంబ సభ్యులు ముందుగానే గుర్తించాలి. మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇప్పించాలి. అలాచేస్తే ఒకరి ప్రాణాలను కాపాడుకున్న వారం అవుతాం.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

- ప్రత్యేక అధికారి, మెప్మా ఫైనాన్స్ మేనేజర్ శ్రీపాద రామేశ్వర్
- మెదక్ ఆర్టీసీ నుంచి రూ.2.86 లక్షలు వసూలు



ఆర్టీసీ అధికారుల నుంచి పన్ను వసూలు చేస్తున్న శ్రీపాదరామేశ్వర్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలో వంద శాతం పన్ను వసూళ్లు చేయాలని మెదక్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల మున్సిపాలిటీల పన్ను వసూళ్ల ప్రత్యేక అధికారి, మెప్మా ఫైనాన్స్ మేనేజర్ శ్రీపాద రామేశ్వర ఆదేశించారు. శుక్రవారం ఆయన మెదక్ పట్టణంలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. వారి వెంట వెళ్లి ఆర్టీసీ సముదాయాలకు చెందిన రూ.2.86 లక్షల పన్ను వసూలు చేశారు. అనంతరం కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశమై మిగిలిన మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ భవాని ఉన్నారు.

మగ సంతానం కోసం బాలికతో వివాహం

- అతనికి అప్పటికే ముగ్గురు ఆడపిల్లలు
- పోలీసులకు ఫిర్యాదు.. పెళ్లికొడుకు పరారీ

రామాయంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అప్పటికే వివాహమై ముగ్గురు ఆడపిల్లలకు తండ్రి అయిన రామాయంపేట మండలంలోని కాట్రియాల తండాకు చెందిన ఓ వ్యక్తి మగ సంతానం కోసం వారం క్రితం ఓ బాలికను పెళ్లి చేసుకున్నాడు. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పోలీసులు, బాలికా సంరక్షణ విభాగం అధికారులు రంగంలోకి దిగారు. బాలికను సఖీ కేంద్రానికి తరలించారు. పెళ్లి కొడుకు పరారయ్యాడు. ఈ వివాహం కోసం మొదటి భార్యతో పాటు బాలిక తరఫు వారందరినీ పెళ్లి కొడుకు ఒప్పించినట్లు సమాచారం.

ప్రాణాలతో ఆట

5వ పేజీ తరువాయి..

నిన్న, మొన్నటి వరకు బెట్టింగ్ యాప్‌ల ద్వారానే బెట్టింగ్ నిర్వహించగా, తాజా పరిణామాల దృష్ట్యా తెరపైకి బుకీలు అరగ్రేటం చేశారు. బెట్టింగ్‌లో అనుభవం ఉన్న వ్యక్తి బుకీ అవతారమెత్తి తెలిసిన వ్యక్తికి, అతని బంధువులకు డబ్బులు ఆశ చూపి, బెట్టింగ్‌ను ప్రోత్సహించేలా పలువురు యువకులు, క్రికెట్ అభిమానులను ఈ దందాకు అలవాటు పడేలా చేస్తున్నారు. ఈ తంతంగమంతా మొబైల్ ద్వారానే ఆయా జిల్లాలోని ఓ ప్రాంతంలో లేదంటే ఇతర ప్రాంతం నుంచి బెట్టింగ్‌ను నిర్వహిస్తున్నారు. రెట్టింపు డబ్బు వస్తుందని ఆశ కలుగుతుండటంతో యువకులు, క్రీడాభిమానులు బెట్టింగ్‌లో పెడుతున్నారు. ఈ క్రమంలో బెట్టింగ్ దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా అన్నట్లుగా సాగుతుంది.

ఈజీ మనీ కోసం

ఇంతకాలం పట్టణాలకే పరిమితమైన ఈదందా క్రమంగా ఇప్పుడు గ్రామాలకు కూడా పాకింది. ఆయా గ్రామాల్లో ఉన్న యువకులు స్థానికంగా అప్పులు తీసుకుని తెలిసిన వారి వద్ద బెట్టింగ్ పెడుతున్నారు. రూ.5నుంచి 10 వడ్డీతో ప్రాంసరీ నోట్‌పై రాయించుకొని డబ్బు ఇస్తున్నట్లు సమాచారం. బెట్టింగ్‌లో డబ్బులు వచ్చినా, రాకున్నా వడ్డీతో సహా వారికి చెల్లించాల్సిందే. నిర్ణీత గడువులో చెల్లించకపోతే ఇంటికి వచ్చి డబ్బు వసూలు చేస్తామని ముందే హెచ్చరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుకున్న దాన్ని బట్టి డబ్బు వచ్చిన యువకులు ఆనందంగా ఉంటే, మ్యాచ్ ఓడిపోవడంతో బెట్టింగ్‌కు పెట్టిన డబ్బు పోవడంతో చేసిన అప్పులు తీర్చలేకపోతున్న యువకులు చిన్న వయసులోనే అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అప్పులు తీర్చలేక ఇంట్లో చెప్పుకోలేక లోలోన కుమిలిపోతున్నారు. కొందరు ఒత్తిడి తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తెలంగాణ గేమింగ్ యాక్ట్-2017 ప్రకారం ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై నిషేధం కొనసాగుతోంది. గేమింగ్ యాప్‌లతో పాటు బెట్టింగ్ యాప్‌లనూ యాక్సెస్ చేయడాన్ని ఈ చట్టం నిషేధిస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి మెదక్ జిల్లా పోలీసు యంత్రాంగం ఈ బెట్టింగ్ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. మండల కేంద్రాల్లో పోలీసులు ప్రెస్‌మీట్‌లు పెట్టి అవగాహన కలిస్తున్నారు.

ఉగాది తర్వాత
ఇందిరమ్మ ఇళ్లకు నిధులు

- బేస్‌మెంట్ పూర్తయితే చెల్లింపులు
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్

మెదక్ అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉగాది తర్వాత ఇందిరమ్మ ఇళ్లకు మొదటి విడత నిధులను మంజూరు చేస్తామని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తెలిపారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియపై కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఇందిరమ్మ లబ్ధిదారులు 400 చదరపు అడుగుల నుంచి 500 చదరపు అడుగుల వరకు ఇళ్లను నిర్మించుకోవచ్చన్నారు. అదనంగా ఇంటి కొలతలను తీసుకొని ఎక్కువ మొత్తంలో నిధులు ఉపయోగించి నిర్మించిన యెడల ఉపయోగముండదన్నారు. అంతేకాకుండా అప్పులు బారిన పడే అవకాశం ఉందని, ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలన్నారు. జిల్లాలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల మంజూరు లక్ష్యంగా ప్రభుత్వం మొదటి విడతగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి జనవరి 26న ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 1242 ఇళ్ల మంజూరు కాగా, వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. నిర్మాణాల ప్రక్రియ ఏమాత్రం పెండింగ్ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వెల్దుర్తి మండల పరిధిలోని ధర్మారంలో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించామన్నారు. ప్రభుత్వం నాలుగు విడతల్లో చెల్లింపు చేస్తుందన్నారు. మొదటి విడతగా బేస్‌మెంట్ పూర్తయిన ఇంటికి రూ.లక్ష మంజూరు చేస్తామన్నారు. ఇండ్ల నిర్మాణాల్లో వేగం పుంజుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, హౌసింగ్ పీడీ మాణిక్యం, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డీపీవో యాదయ్య తదితరులు పాల్గొన్నారు. మెదక్ మండల పరిధిలోని బాలనగర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ గృహ నిర్మాణ ప్రక్రియను హౌసింగ్ ఎండీ గౌతమ్ పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకుని అవగాహన కల్పించారు.



వెల్దుర్తి మండలం ధర్మారం గ్రామంలో ఇల్లు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్

పేదల సొంతింటి కల సాకారం

వెల్దుర్తి/అమీన్‌పూర్, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిరుపేదల సొంతింటి కల నెరవేరుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్ అన్నారు. శుక్రవారం ఆయన వెల్దుర్తి మండల పరిధిలోని ధర్మారం, అమీన్‌పూర్ మండలం జానకంపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన వెంట మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, హౌసింగ్ కార్పొరేషన్ మెదక్ జిల్లా పీడీ మాణిక్యం, సంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ చలపతిరావు, డిప్యూటీ ఈఈ రవీందర్, ఏఈ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అలరించిన ఉగాది కవి సమ్మేళనం

మెదక్ కల్చరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనం అందరిని అలరించింది. తెరసం అధ్యక్షురాలు ముత్తిగారి కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవి నందిని సిధారెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం తెరసం జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ చరిత్రకు వారధి కవులని, భావి తరాలకు తెలియాలంటే కవులు కలాలు కదిలించాలని అన్నారు. తెరసం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకర్ మాట్లాడుతూ గతేడాది సంతోషాలతో పాటు బాధలు మిగిల్చిందన్నారు. కొన్ని చోట్ల మనుషులపై మూత్రం పోసిన వారి కాళ్లకు పూలు చల్లడం సిగ్గుచేటన్నారు. సంతోషం ఏమిటంటే సునీత విలియమ్స్ భూమిపై సజీవంగా అడుగు పెట్టడమని తెలిపారు. నందిని సిధారెడ్డి మాట్లాడుతూ అన్ని ఉద్యమాల్లో కవితోద్యమం ముందుంటుంది అన్నారు. రాజకీయాల్లో భూతులు ఎక్కువయ్యాయని, ఇలాంటి వాటిని తమ కలాలతో వ్యతిరేకించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన కవులు వారి స్వీయ కవితలు వినిపించారు. ఉగాది ఉషస్సులు విరబూయాలని, సమసమాజ స్థాపనకు నడుంబిగించాలని, అసమానతలు తొలిగిపోవాలని భిన్నత్వంలో ఏకత్వమై సాగాలని కవితలు వినిపించారు. చిన్నారులు చేసిన నృత్య కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కవులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శంకర్, ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్, తెరసం జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి రాములు, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్, కవులు తదితరులు పాల్గొన్నారు



జ్యోతి ప్రజ్వలన చేసి కవి సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న నందిని సిధారెడ్డి

అడుగంటుతున్న ఆశలు

- తగ్గిన భూగర్భ జలాల నీటిమట్టం
- సన్నటి ధారగా పోస్తున్న బోర్లు
- పశువుల మేతగా వరి పొలాలు

రామాయంపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో బోరుబావుల కింద సాగు చేసిన వరి పంట ఎండుముఖం పడుతున్నది. కొన్ని బోరుబావులు సన్నటి ధారగా పోస్తుండడంతో అందినకాడికి చేనును తడిపి మిగతా పంటను రైతులు పశువులకు మేతగా వదిలి వేస్తున్నారు. మరికొందరు ట్యాంకర్ల నీటితో పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.





రామాయంపేట పరిధిలో ఎండిన ఓ చేనులో గొర్రెలను మేపుతున్న దృశ్యం, బోర్ల నుంచి వస్తున్న సన్నటి జలధార

వట్టిపోయిన నాలుగు వేల బోర్లు

మెదక్ జిల్లాలో 2,67,119 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా 2,56,000 ఎకరాల్లో వరి పంట సాగవుతున్నది. అధిక శాతం పంట బోరుబావుల కిందే సాగువుతున్నది. సుమారు 70 వేల బోర్లతో నీటిని అందిస్తూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందులో ఇప్పటికే సుమారు 4000 బోర్లు వట్టిపోయాయి. ఇప్పటికే ఇరవై వేల ఎకరాల్లో వరి పంట ఎండి నెర్రెలు వారింది.

అటు పచ్చగా.. ఇటు నెర్రలు బారి

రామాయంపేట ఉమ్మడి మండలంలోనూ విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. చాలా వరకు బోర్లలో నీరు ఇంకిపోయింది. కొన్నిచోట్ల పక్కపక్కనే ఉన్న పంటలు పచ్చగా.. మరికొన్ని ఎండిపోయి కనిపిస్తున్నాయి. ఒకే ప్రాంతంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ నాలుగేళ్ల క్రితం నిర్మించిన కెనాల్ నుంచి మోటార్లు బిగించి పంటలకు నీటి సరఫరా అందిస్తున్నారు. నీరందిన ప్రాంతంలో పచ్చగా కనిపిస్తుండగా, వీటిని విస్తరించకపోవడంతో ఆ పక్కనే ఉన్న పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఓవైపు భూగర్భ జలాలు అడుగంటుతుండడం, మరోవైపు కాల్వల నీరు అందక అన్నదాతలు పంటలను కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

రెండెకరాల్లో ఎండిపోయింది



నాకున్న రెండు ఎకరాల్లో వరి పంట వేసిన. రెండు బోర్లు ఉన్నా చుక్క నీరు రావడం లేదు. దీంతో పక్షం రోజుల కిందనే వరిపై పూర్తిగా ఎండిపోయింది. దిక్కు లేక మేకల మందతో వరి పంట మేపుతున్న.

- సాయిళ్ల సాగర్, రైతు

ఎకరం పంట ఎండింది



వెంకటాపూర్ శివారులో నాకు ఉన్న ఎకరం పొలంలో వరి సాగు చేశాను. బోర్లలో నీరు రాలేదు. దీంతో మరో బోరు మోటార్ దింపి నీటిని అందించే ప్రయత్నం చేసినం. అది కూడా ఫెయిల్ అయ్యింది. దీంతో ఇప్పుడు పంట అంతా ఎండి పశువుల మేపే పరిస్థితి వచ్చింది.

- కొమ్మగాళ్ల బాలమణి, రైతు

పంటలు ఎండిపోతున్నది నిజమే

సబ్‌డివిజన్ పరిధిలో మునుపెన్నడూ లేనంతగా పంటలు ఎండిపోతున్న మాట వాస్తవమే. భూగర్భ జలాలు తగ్గి చాలా చోట్ల బోర్లు నుంచి నీళ్ల రావడం లేదు. రైతులు ఎండిన వరిపైర్లు పక్కనపెట్టి పచ్చగా ఉన్న పొలాలను కాపాడుకోవాలి.

- రాజ్ నారాయణ, రామాయంపేట వ్యవసాయ సంచాలకుడు

గ్లోబల్ వార్మింగ్ కొత్త సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం



ఇక్రిశాట్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మహిళా ఫార్మ్ ఉద్యోగులతో హిమాన్షు పాఠక్, ఉద్యోగులు

- ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్

పటాన్‌చెరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కునేందుకు సమష్టిగా కృషి చేయాలని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షుపాఠక్ పేర్కొన్నారు. శుక్రవారం పటాన్‌చెరులోని ఇక్రిశాట్ పరిశోధనా సంస్థ 54వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులు, శాస్త్రవేత్తలతో నిర్వహించిన సమావేశంలో డైరెక్టర్ జనరల్ మాట్లాడారు. మెట్ట పంటల వ్యవసాయ పరిశోధనలో ఇక్రిశాట్ చేస్తున్న నిరంతర కృషికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. వ్యవసాయ దిగుబడిలో పెరుగుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కునేందుకు కొత్త ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. అన్ని సంస్థలతో కలిసి కట్టుగా పరిశోధనలను చేసేందుకు ఇక్రిశాట్ సిద్ధంగా ఉందన్నారు. పరిశోధనా రంగంలో విప్లవాత్మమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ఇక్రిశాట్ ముందు మరిన్ని కొత్త సవాళ్లు ఉన్నాయన్నారు.

పైలట్ ప్రాజెక్టు పట్టాలెక్కేదెన్నడో?



ములుగులో పిల్లర్ల స్థాయిలోనే నిలిచిన పనులు

- కొన్ని చోట్ల పూర్తయిన మినీ ఐవోసీలు
- మరికొన్ని చోట్ల అర్ధాంతరంగా.. ఇంకొన్నిచోట్ల శంకుస్థాపనలకే పరిమితం
- వెంటాడుతున్న భూసమస్య, నిధుల లేమి
- పూర్తి చేస్తే ప్రజలకు మేలు





జగదేవ్‌పూర్‌లో ప్రారంభానికి సిద్ధమైన మినీ ఐవోసీ, వర్గల్‌లో శంకుస్థాపనకే పరిమితమైన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఫోకస్

గజ్వేల్/గజ్వేల్ డివిజన్ బృందం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని ఆయా మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం గజ్వేల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద మినీ ఐవోసీల నిర్మాణానికి పూనుకుంది. ఒక్కో మినీఐవోసీకి రూ.5కోట్ల చొప్పున మొత్తం రూ.35కోట్లను విడుదల చేసింది.

పనుల పరిస్థితి ఇలా..

కొండపాక మండల కేంద్రంలో నిర్మించిన మినీ ఐవోసీ పూర్తవడంతో పాటు ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఇక మర్కుక్, జగదేవ్‌పూర్ మండల కేంద్రాల్లో నిర్మించిన మినీ ఐవోసీలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఈ మినీ ఐవోసీలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నప్పటికీ వాటికి సంబంధించిన ప్రహరీ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తూప్రాన్ డివిజన్ కేంద్రంలో 80శాతం పనులు పూర్తవగా, మనోహరాబాద్ మండల కేంద్రంలో మొదటి అంతస్తు వరకు పనులు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో ఐవోసీ నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఇక ములుగు మండల కేంద్రంలో నిర్మాణం తలపెట్టిన మినీ ఐవోసీకి సంబంధించిన స్థలం రోడ్డుకంటే దిగువ భాగంలో ఉండడంతో మట్టితో నింపడానికే కాంట్రాక్టర్‌కు తలకు మించిన భారంగా తయారైంది. ఈ క్రమంలో పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టగా, బిల్లులు సరైన సమయానికి అందకపోవడంతో ప్రస్తుతం నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేశారు. ఇక వర్గల్ మండల కేంద్రాలలో భూసమస్య ఉండడంతో శంకుస్థాపనలకే మినీ ఐవోసీల పనులు పరిమితమయ్యాయి. కొత్తగా ఏర్పడిన కుకునూరుపల్లి మండల కేంద్రంలో నిర్మాణానికి సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.

పూర్తయితే తప్పనున్న ఇక్కట్లు

గజ్వేల్ నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో నిర్మించతలపెట్టిన కార్యాలయాలను పూర్తి చేస్తే మండలస్థాయి అధికారుల కార్యాలయాలు అన్ని ఒకే చోటకు వచ్చి ప్రజలకు ఇబ్బందులు తప్పే అవకాశం ఉంది. తహసీల్దార్, ఎంపీడీవో, ఆయా విభాగాల మండలస్థాయి ఏఈ కార్యాలయాలు, మండల వ్యవసాయాధికారి, విద్యాధికారి ఇతరత్రా కార్యాలయాలు ఒకే చోట ఏర్పాటు కావడం వల్ల ప్రజలు ఆయా కార్యాలయాల్లో ఉండే పనులను ఒకే క్యాంపస్‌లో పూర్తి చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. ఈ క్రమంలోనే కలెక్టరేట్, గజ్వేల్ డివిజన్ ఐవోసీ మాదిరిగా మండల కేంద్రాల్లో మినీ ఐవోసీల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. పైలట్ ప్రాజెక్టు కాస్తా ఆయా కారణాలతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

మినీ ఐవోసీలను పూర్తి చేయాలి



గత ప్రభుత్వం నిర్మించతలపెట్టిన మినీ ఐవోసీలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. మధ్యలో ఆగిన భవనాల పనులకు సంబంధించిన నిధులు విడుదల చేస్తే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మండలస్థాయిలో ఒకే గొడుగు కింద వచ్చి ప్రజా సేవలు ప్రజలకు చేరువవుతాయి. ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేసి వర్గల్, కుకునూరుపల్లి మండలాల్లో మినీ ఐవోసీల నిర్మాణం చేపట్టాలి.

\- సందబోయిన ఎల్లయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు

బిల్లుల పెండింగ్‌తోనే నిలిచిన పనులు



బిల్లుల పెండింగ్ కారణంతోనే పనులు మధ్యలో నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయితే పనులు చేయడానికి కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారు. వర్గల్, కుకునూరుపల్లిలో భూసమస్య ఉండడంతో పనులు మొదలు కాలేదు. జగదేవ్‌పూర్, ములుగు, మర్కుక్, మనోహరాబాద్, తూప్రాన్ మినీ ఐవోసీలు నిధులు లేకపోవడంతో నిలిచిపోయాయి. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నిధులు రాగానే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

\- చిరంజీవాచారి, పీఆర్ ఈఈ, గజ్వేల్

హుస్నాబాద్ అంగడి వేలంలో కాంట్రాక్టర్ల సిండికేట్?

- గతం ఏడాది కంటే రూ. 28.5 లక్షల తగ్గింపు

హుస్నాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ అంగడి వేలం ఎట్టకేలకు ఖరారైంది. శుక్రవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో 4వ సారి నిర్వహించిన వేలంపాటలో పట్టణానికి చెందిన అయిలేని కిషన్‌రెడ్డి అనే కాంట్రాక్టర్ రూ. 92,20,667లకు దక్కించుకున్నారు. గత ఏడాది రూ. 1,20,26,000 ఆదాయం రాగా, ఈసారి గతంలో కంటే రూ. 28.5 లక్షల ఆదాయం తగ్గింది. హుస్నాబాద్ అంగడికి 14 మంది కాంట్రాక్టర్లు రూ. 10 లక్షల చొప్పున ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. గత ఏడాది కంటే 5 శాతం ఎక్సెస్‌తో రూ. 1,26,27,300ల నుంచి వేలం ప్రారంభించగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మూడు మార్లు వాయిదా పడింది. ఈ సారి మాత్రం రూ. 92,10,667 నుంచి పాట ప్రారంభించగా అయిలేని కిషన్‌రెడ్డి అనే కాంట్రాక్టర్ రూ. 92,20,667కు అంగడి కాంట్రాక్ట్‌ను పొందారు.



హుస్నాబాద్ అంగడి వేలంపాటను నిర్వహిస్తున్న అధికారులు

అయితే ఇందులో కాంట్రాక్టర్లు సిండికేట్ అయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇందులో ఒక్కో కాంట్రాక్టరుకు రూ. 80 వేలు పంచినట్లు సమాచారం. దీంతో గత సంవత్సరం వచ్చిన ఆదాయంలో రూ. 28.5 లక్షలు గండిపడింది. కాగా వేలంలో కాంట్రాక్టర్లు సిండికేట్ అయి మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టిన దృష్ట్యా ఈ టెండర్‌ను రద్దు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు శివరాజ్ అధికారులను కోరారు.

దూళిమిట్ట ఏంపీడీవో నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దూళిమిట్ట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న 'ఇంకెప్పుడు ఏర్పాటు చేస్తారు?' అనే శీర్షికతో దూళిమిట్ట ఏంపీడీవో కార్యాలయం ఏర్పాటుతో పాటు ఏంపీడీవో నియామకంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. నూతనంగా ఏర్పడిన దూళిమిట్ట మండల పరిషత్ కార్యాలయ ఇన్‌చార్జి ఎంపీడీవోగా మద్దూర్ మండల ఏంపీవో వీరరాజును, ఇన్‌చార్జి ఎంపీవోగా మద్దూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు శుక్రవారం ఉమ్మడి మద్దూర్ మండల ఏంపీడీవో రాంమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు.

సిద్దిపేట జిల్లా ఆర్టీఏ సభ్యుడిగా సూర్యవర్మ



సూర్యవర్మను అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట టౌన్, మార్చి28(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ఆర్టీఏ (రీజినల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ) సభ్యుడిగా ఓబీసీ సెల్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ లక్కరసు సూర్యవర్మను నియమించారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం హైదరాబాద్‌లో నియామకపత్రాన్ని సూర్యవర్మకు అందజేశారు. డాక్టర్ సూర్య వర్మ మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

హుస్నాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : లంబాడీల గోర్ బోలి భాషను భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రొఫెసర్ వీరన్ననాయక్, నాయకులు తదితరులున్నారు.

బాలల రక్షణకు అందరూ కృషి చేయాలి

- చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి బాయికాడి లక్ష్మణ్

సిద్దిపేట రూరల్,మార్చి 28(ఆంధ్రజ్యోతి); బాలల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రతినిధి బాయికాడి లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం మల్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ, విద్యార్థుల డ్రాపవుట్, బాలల రక్షణ, వారి హక్కుల గురించి వివరించారు. బాలలకు ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1098కి ఫోన్ చేసి సమాచారమివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్, బాలల పరిరక్షణ ప్రతినిధి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువుల దొంగలకు రిమాండ్

దుబ్బాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పశువుల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు యువకులను మండలకేంద్రంలో శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 25న రాజక్కపేట గ్రామరైతు నర్సింలుకు చెందిన ఎద్దు, 19న అప్పనపల్లి గ్రామ రైతు భాస్కర్‌కు చెందిన ఆవు కనబడడంలేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో దుబ్బాకకు చెందిన ఎడ్ల మహేష్, పెంటం శ్రావణ్, చెల్లాపూర్ వార్డుకు చెందిన నవీన్ అనే యువకులు పశువులను దొంగిలించి వాహనాల్లో తరలించి అంగడిలో విక్రయిస్తున్న సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. వారు అంగడిలో పశువులను విక్రయిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తామే దొంగతనాలను పాల్పడినట్టు అంగీకరించారు. దీంతో కేసు నమోదు చేసిని పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

సిద్దిపేట క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల సిద్దిపేట ట్రాఫిక్‌సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను శుక్రవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ అనంతరం వారికి రూ.11,500 జరిమానా విధించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే దుబ్బాక అభివృద్ధి



వెంకట్రావ్‌పేటలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట/మిరుదొడ్డి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే దుబ్బాక నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావ్‌పేటలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు. అంతకు ముందు జప్తిలింగారెడ్డిపల్లి గ్రామంలో అనారోగ్యానికి గురైన పట్నం ఎల్లయ్య వైద్యం కోసం రూ. 2లక్షల ఎల్‌వోసీని, తుక్కాపూర్ గ్రామానికి చెందిన విఠల్‌కు రూ.60 వేల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. మిరుదొడ్డి మండలం అల్వాలలో ఎన్‌ఆర్‌ఐఈజీఎస్ కింద రూ.20లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.

సాంస్కృతిక ప్రదర్శనతో ఆకట్టుకున్న విద్యార్థులు



విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్

హుస్నాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ కె శ్రీనివాస్, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్య అవశ్యకతను వివరించారు.

స్కావెంజర్ల వేతనాలు వెంటనే చెల్లించాలి

సిద్దిపేట క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్ల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్యాల విజయేందర్ రెడ్డి, సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిద్దిపేట డీఈవోకు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో పరిశుభ్రత కోసం ప్రభుత్వం స్కావెంజర్లను నియమించిందని, అయితే డిసెంబర్ నుంచి వేతనాలు రాక స్కావెంజర్లు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్కావెంజర్ల వేతనాలకు సంబంధించిన నిధులు విడుదల చేయాలని కోరారు.

పొద్దుతిరుగుడు పంటపై క్షేత్ర దినోత్సవం

చిన్నకోడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచాపూర్ రైతు వేదికలో శుక్రవారం రైతు ఉత్పత్తిదారులసంస్థ (ఎఫ్‌పీవో) ఆధ్వర్యంలో భారతీయ నూనె గింజల పరిశోధనాసంస్థ ప్రతినిధులు సందీశ్వర్, నిహారిక, అశోక్ పొద్దు తిరుగుడు పంటపై క్షేత్ర దినోత్సవం న్విహించారు. ఈ సందర్భంగా వారు పొద్దుతిరుగుడు పంట యాజమాన్యం, మెళకువలు, నూనెగింజల ప్రాముఖ్యతను గూర్చి రైతులకు వివరించారు. అనంతరం గ్రామంలో పలువురు రైతులు సాగుచేసిన పొద్దు తిరుగుడు పంటలను పరిశీలించారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసంపై విచారణ

కొండపాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మక్కపల్లిలో అంబేడ్కర్ విగ్రహ విధ్వంసం సంఘటనపై గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామంలో సంఘటనాస్థలం వద్ద గ్రామస్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ పేర్కొన్నారు. ఆయన వెంట సీఐ లతీఫ్ కుకునూరుపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. కాగా దమ్మక్కపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని దళితసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాకీ చంద్రభాను డిమాండ్ చేశారు. మండలంలోని దుద్దెడలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం ఘటనను తీవ్రంగా ఖండించారు.

'ముస్లింలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

సిద్దిపేట టౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ హయాంలో ముస్లింలకు ఏటా రంజాన్ కిట్లను పంపిణీ చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను పూర్తిగా విస్మరించిందని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు విమర్శించారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని 26వ వార్డులో మాజీమంత్రి హరీశ్‌రావు ఆదేశానుసారం ముస్లింలకు రంజాన్ కిట్లను అందజేశారు.

కోనేరుకు పూర్వ వైభవం తీసుకురావాలి

మర్కుక్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలంలోని వరదరాజపూర్ గ్రామంలో 12వ శతాబ్దంలో నిర్మించిన పురాతన వరదరాజస్వామి ఆలయ కోనేరును పునరుద్ధరణ చేసి, వచ్చే బ్రహ్మోత్సవాల వరకు స్వామివారిని కోనేరులోనే చక్రస్నానం జరిపించాలని రోటరీక్లబ్ గజ్వేల్ సెంట్రల్ అధ్యక్షులు తుమ్మ కృష్ణ కోరారు. శుక్రవారం ఆయన కోనేరు స్థితిగతులను పరిశీలించారు. ఎర్రవల్లి యువకులతో కలిసి శ్రమదానం చేసి కోనేరులో పెరిగిన పిచ్చి మొక్కలను వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ భూనీల సమేత వరదరాజస్వామి ఆలయం ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పాక్స్ వైస్ చైర్మన్ కమ్మరి బాలరాజు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందినవారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి

చేర్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మృతిచెందిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు రూ.20లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని కోరుతూ చేర్యాల మండల భవన నిర్మాణకార్మికసంఘం నాయకులు శుక్రవారం కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చేర్యాల మండల అధ్యక్షుడు కుర్రారం బాలనర్సయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు దుర్భరజీవితాలు గడుపుతున్నారని, చనిపోయినవారి కుటుంబాలకు రూ.20లక్షలు, గాయపడిన వారికి రూ.5లక్షల చొప్పున సహాయం అందించాలని కోరారు. కార్మికులందరికీ హెల్త్‌కార్డులు, 50ఏళ్లు పైబడినవారికి పెన్షన్ అందించి ఆదుకోవాలని కోరారు.

సిద్దిపేటలో పాలిటెక్నిక్ ఫ్రీ కోచింగ్

సిద్దిపేట క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో పాలిటెక్నిక్ ఫ్రీ కోచింగ్ ఇస్తున్నట్లు ఏబీవీపీ నగర కార్యదర్శి పరిశ్రమ అన్నారు. శుక్రవారం స్థానిక సంజీవని పారామెడికల్ జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాలీసెట్ ఎంట్రెన్స్ ఫ్రీ కోచింగ్ తరగతులు సిద్దిపేటలోని స్థానిక సంజీవని పారామెడికల్ జూనియర్ కళాశాలలో ఏప్రిల్ 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగులకు ఇంటర్వ్యూలు

కొండపాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సబ్సిడీ లోన్లకోసం ఇంటర్వ్యూలను అధికారులు శుక్రవారం కొండపాకలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా..

రాయపోల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాయపోల్‌లో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న షాదుల్లా కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ పరామర్శించారు. రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని, వారి పిల్లలను మైనార్టీ హాస్టల్‌లో చేర్పి చదివించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

న్యాయవాదులకు అండగా ఉంటాం

సిద్దిపేట క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తనపై పూర్తి విశ్వాసంతో గెలిపించిన న్యాయవాదులకు అండగా ఉంటామని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాటికొండ రమేష్ పేర్కొన్నారు. సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జనార్దన్ రెడ్డి గెలిచిన సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు.

చలివేంద్రం ప్రారంభం

గజ్వేల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ప్రారంభించారు. ఆయనవెంట ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వాసవీక్లబ్ బాధ్యులు శేఖర్‌గుప్తా, నవీన్ గుప్తా, అత్తెల్లి లక్ష్మయ్య తదితరులున్నారు.

కొమ్మూరితోనే అభివృద్ధి

చేర్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చొరవతోనే గ్రామాల్లో మౌలికవసతులైన సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ కొమురవెల్లి మండల ప్రధాన కార్యదర్శి సనాది భాస్కర్ అన్నారు. కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామంలో రూ.15లక్షలు వ్యయంతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణం పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు.

హుస్నాబాద్ ఆసుపత్రికి పరకాల వైద్యులు

హుస్నాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కాయకల్ప పీర్ అసెస్‌మెంట్ సందర్భంగా శుక్రవారం హుస్నాబాద్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని హన్మకొండ జిల్లా పరకాల ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సందర్శించారు. ఆసుపత్రిలోని వైద్య సేవలను సూపరింటెండెంట్ రమేశ్‌రెడ్డి వివరించారు. ఆవరణలోని పచ్చదనం పరిశుభ్రతను పరిశీలించారు. కార్యక్రమంలో పరకాల ఆర్‌ఎంవో బాలక్రిష్ణ, వైద్యులు మౌనిక, విజయ్‌కుమార్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

మర్పడగ మల్లికార్జున స్వామికి అన్నాభిషేకం





మల్లికార్జునస్వామివారికి అన్నాభిషేకం, సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కొండపాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పడగలో శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం సంతాన మల్లికార్జునస్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా విజయ దుర్గామాత ఆలయంలో రాహుకాల పూజలను క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయదుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లఘున్యాస పూర్వకంగా సంతాన మల్లికార్జున స్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించి అన్నాభిషేకం నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వాహణకమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి అవార్డు



కలాం అవార్డు అందుకుంటున్న అశ్విని, గైడ్ చిన్నబ్రహ్మయ్య

మర్కుక్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంటకు చెందిన 9వ తరగతి విద్యార్థినికి కలాం అవార్డు లభించింది. చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో 125 మూలకాలు వాటి సంకేతాలను 58 సెకండ్లలో పూర్తి చేసి ప్రపంచ రికార్డును సొంతం చేసుకుందని మండల విద్యాధికారి వెంకట్‌రాములు తెలిపారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గైడ్ చిన్న బ్రహ్మయ్య, అవార్డు సాధించిన విద్యార్థిని అశ్వినిని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌లు అభినందించారు.

ఎంపీడీవో కార్యాలయ కొత్త భవనానికి రూ.1.50 కోట్లు

అక్కన్నపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ నూతన భవన నిర్మాణం కోసం రూ.1.50 కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి (ఎఫ్‌ఏసీ) లోకేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మతసామరస్యాన్ని చాటిచెప్పిన 'ఇఫ్తార్'



సిద్దిపేటలోని ఈద్గా వద్ద ఇఫ్తార్ విందులో ఖర్జూర్ తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



గజ్వేల్‌లోని మదీనా మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న నర్సారెడ్డి

సిద్దిపేట టౌన్/గజ్వేల్/దుబ్బాక/చేర్యాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం ప్రభుత్వం తరపున అధికారికంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. అదే విధంగా ఆయా సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో పలుచోట్ల ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటి చెప్పారు. అధికారికంగా ఏర్పాటు చేసిన విందులో నాయకులు, అధికారులు పాల్గొని ఖర్జూర్ తదితర పండ్లను పరస్పరం తినిపించుకున్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ఈద్గా వద్ద ప్రభుత్వం అధికారికంగా ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయగా ముస్లింలతో పాటు ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తూఇమామ్ కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. రంజాన్ మాసపు చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని సిద్దిపేటలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు(నమాజ్) చేశారు. గజ్వేల్ పట్టణంలోని మదీనా మజీద్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, తన్జీముల్ మసాజిద్ కమిటీ చైర్మన్ సయ్యద్ మతీన్, అంకక్షారెడ్డి, సమీర్, జహీర్, వహీద్, అజ్గర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. దుబ్బాక నియోజకవర్గస్థాయి ఇఫ్తార్‌విందును ప్రభుత్వం తరఫున స్థానిక రజనీకర్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమం లో దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట- భూంపల్లి మండలాల తహసీల్దార్లు, ముస్లింలు పాల్గొన్నారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలోని మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు బీఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



సిద్దిపేటలోని గద్దబొమ్మ వద్ద మసీదులో ముస్లింల ప్రార్థనలు